ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
మహబూబ్‌నగర్
జిల్లా వార్తలు
గురువారం 12 జూన్ 2025
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 32.0 కనిష్ఠం : 24.0



పరిశ్రమలో అగ్నిప్రమాదం

- రూ. 4 లక్షల ఆస్తి నష్టం
- జడ్చర్ల మండలం పోలేపల్లి టీఎస్ ఐఐసీ ప్రాంగణంలో ఘటన
- బ్రాయిలర్ పైపులైనులో ఆయిల్ నిలిచిపోవడంతో చెలరేగిన మంటలు 7



వనపర్తి జిల్లా కేంద్రంలో ఓ రేషన్ దుకాణం వద్ద బారులు తీరిన లబ్ధిదారులు

సన్నాలకూ.. సున్నం

- సన్న బియ్యం రూ. 16 నుంచి రూ. 20 వరకు కొంటున్న రేషన్ డీలర్లు
- తంబ్ వేశాక బియ్యం పంపిణీ చేసినట్లు చూపించి డబ్బు చెల్లింపు
- గతంలోనూ ఇదే తంతు, అప్పట్లో దొడ్డుబియ్యం కావడంతో అమ్మకం
- అనర్హులకు రేషన్ కార్డులు ఉండమే ప్రధాన కారణం.. తొలగిస్తే మేలు



పాలమూరులోని ఓ దుకాణంలో బియ్యం తూకం వేస్తున్న డీలర్

ప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు పంపిణీ చేస్తున్న సన్నబియ్యం పథకం కూడా కొంతవరకు పక్కదారి పడుతోంది. ఇదివరకు దొడ్డు బియ్యం, అందులోనూ నాణ్యత కొరవడటంతో ఎక్కువ మంది రేషన్ షాపుల నుంచి బియ్యం తీసుకోకుండానే దానికి సరిపడా డబ్బులు తీసుకునే వారు. కానీ ఇప్పుడు పేదల పొట్టనింపేందుకు, బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు కొనలేని రేషన్‌కార్డు దారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తోంది. అత్యధికులు రేషన్ బియ్యం తింటున్నా, పట్టణ ప్రాంతాల్లోని కొందరు అధిక ఆదాయం కలవారు వినియోగించుకోవడంలేదు. దీంతో రేషన్ డీలర్లకే వాటిని తక్కువ ధరలకు అమ్ముతున్నారు. ఈ పరిస్థితిని అరికట్టి అర్హులకు సమర్థవంతంగా పథకాన్ని అందించాల్సి ఉంది.

మహబూబ్‌నగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతీనెల పంపిణీ చేసే బియ్యాన్ని లబ్ధిదారులు వినియోగించుకునేందుకు వీలుగా గతంలో పంపిణీ చేసిన దొడ్డు బియ్యానికి బదులు సన్నబియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించింది. సద్వినియోగంతో పాటు బియ్యం రీసైక్లింగ్‌కు చెక్ పెట్టేందుకు ఆర్థికభారం అవుతున్నా మూడు నెలలుగా పౌరసరఫరాల దుకాణాల ద్వారా సన్న బియ్యం అందిస్తోంది. మెజారిటీ లబ్ధిదారులు సన్నబియ్యాన్ని



మహబూబ్‌నగర్‌లోని వీరన్నపేటలో గల రేషన్ షాపు వద్ద బారులు తీరిన లబ్ధిదారులు(ఫైల్)

సద్వినియోగం చేసుకుంటుండగా రేషన్ రీసైక్లింగ్‌కు అలవాటుపడిన డీలర్లు మళ్లీ పాత పద్ధతిని అవలంబిస్తున్నారు. ఈ నెలలో కేంద్ర ప్రభుత్వం వర్షాకాలం నేపథ్యంలో ఒకేసారి మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని పంపిణీ చేయాలని నిర్ణయించింది. నలుగురు ఉన్న కుటుంబానికి 6 కిలోల చొప్పున 72 కిలోలు ఒకేసారి అందిస్తున్నారు. ఈ నెల ఒకటవ తేదీ నుంచే పంపిణీ ప్రారంభమైంది. ఎక్కువ బియ్యం పంపిణీ చేస్తుండటంతో స్టాక్ అయిపోయి ఇండెంట్ మళ్లీ తెప్పించుకోవడంలో డీలర్లు తాత్సారం చేస్తున్నారు. ఇదేక్రమంలో సన్నబియ్యాన్ని రీసైక్లింగ్ చేసేందుకు ఎత్తుగడలు వేస్తున్నారు. గతంలో దొడ్డు బియ్యం పంపిణీ చేసే సమయంలో కూడా ఇదే తరహాలో డీలర్లు రీసైక్లింగ్‌కు పాల్పడగా దాన్ని అడ్డుకునేందుకు సన్నబియ్యం పథకం అమలు చేస్తుండగా మళ్లీ అదే ప్రక్రియకు పూనుకుంటున్నారు. స్టాక్‌లేదని చూపి తంబ్ వేస్తే డబ్బులు చెల్లిస్తామని చెబుతున్నారు. గ్రామాల్లో పూర్తి సద్వినియోగం అవుతున్న సన్నబియ్యం పథకం పట్టణాలకు వచ్చేసరికి సద్వినియోగం కావడంలేదు.

కిలో రూ. 16 నుంచి రూ. 20కి కొనుగోలు..

గతంలో దొడ్డు బియ్యం పంపిణీ చేసిన సమయంలో లబ్ధిదారులు రేషన్ దుకాణాల్లో తంబ్

(మిగతా 6లో..)

సమన్వయంతో.. సత్ఫలితాలు సాధిస్తాం

ప్రజలు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటా

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- పార్టీని నమ్మిన వారికి తప్పక న్యాయం చేస్తాం
- ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో వివరిస్తాం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యం
- నారాయణపేట ఎమ్మెల్యే, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టెం పర్ణికారెడ్డి



ఆంధ్రజ్యోతితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్ణికారెడ్డి

నారాయణపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): అధిష్ఠానం అప్పజెప్పిన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవితో బాధ్యత మరింత పెరిగింది. ఆ బాధ్యతలను అంకితభావంతో నిర్వర్తిస్తా. కార్యకర్తలతో కలిసి పనిచేస్తూ, ఎమ్మెల్యేగా నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతా. ఇటు ప్రజలకు, అటు కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ సత్ఫలితాలు సాధిస్తాం.' అని అంటున్నారు నారాయణపేట ఎమ్మెల్యే, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టెం పర్ణికారెడ్డి. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన ఆమె గురువారం సీవీఆర్ బంగ్లాలో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

పార్టీ పటిష్టతకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

అధిష్ఠానం అప్పగించిన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తా. క్షేత్ర స్థాయిలో కార్యకర్తలకు అందుబాటులో ఉంటా. ప్రజల మధ్య ఉంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందేలా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ పథకాలు, సాధించిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరిస్తాం. పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలు. నన్ను ఎమ్మెల్యేగా గెలిపించేందుకు శ్రమించిన కార్యకర్తలతో కలిసి పార్టీని మరింత బలోపేతం చేసేలా చర్యలు తీసుకుంటాం.

పార్టీ, ఎమ్మెల్యే పదవికి ఎలా న్యాయం చేస్తారు?

అధిష్ఠానం అప్పగించిన పార్టీ పదవికి న్యాయం చేకూర్చేలా పాటుపడతా. పార్టీ ఆదేశాలు తూచా తప్పకుండా పాటిస్తాం. కార్యకర్తలకు అందుబాటులో ఉంటాం. ఎమ్మెల్యేగా నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతాం. ప్రజలకు అందుబాటులో ఉంటాం. ఏ సమస్య ఉన్నా.. మా దృష్టికి వస్తే తక్షణమే పరిష్కరిస్తాం.

మీరు పార్టీకి కొత్త కదా? ఎలా సమన్వయం చేస్తారు?

నేను రాజకీయ కుటుంబం నుంచి వచ్చా. పూర్తి స్థాయిలో అవగాహన ఉంది. మా తాతగారైన దివంగత చిట్టెం నర్సిరెడ్డి, మా తండ్రి దివంగత చిట్టెం వెంకటేశ్వర్‌రెడ్డిల అడుగుజాడలో నడిచా. చిన్నతనం నుంచే రాజకీయాలపై దృష్టి సారించా. అప్పట్లో తాత, నాన్నలు చెప్పే విషయాలపై అవగాహన ఉంది. వారు పలు అంశాలపై డిక్టేట్ చేస్తే నేను లేఖలు కూడా రాశాను. దాంతో రాజకీయాలపై పూర్తి స్థాయిలో అవగాహన ఉంది. రాజకీయాలకు నేనేమీ కొత్త కాదు. అందరినీ కలుపుకొని సమన్వయంతో ముందుకు సాగుతా.

పార్టీలో విభేదాలపై మీ అభిప్రాయం ఏమిటి? వారిని ఏకతాటిపైకి తెచ్చేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

పార్టీలో పాత, కొత్త అనే విభేదాలు పక్కన పెట్టి, అందరినీ ఏకతాటిపైకి తెస్తాం. పార్టీనే నమ్ముకొని

(మిగతా 6లో..)

మోగనున్న బడి గంట

- వేసవి సెలవుల తర్వాత నేడు తెరుచుకోనున్న పాఠశాలలు
- ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల లేమి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం/నారాయణపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు ముగియడంతో గురువారం నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. 50 రోజుల తర్వాత స్కూల్స్ విద్యార్థులతో కళకళలాడనున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా 1,147, నారాయణపేట జిల్లా వ్యాప్తంగా 528 ప్రభుత్వ, లోకల్ బాడి, కేజీబీవీ, గురుకులాలు, మోడల్ స్కూల్స్, ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల కోసం ఉపాధ్యాయులు ఈ నెల 6 నుంచి 11 వరకు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. చాలా పాఠశాలల్లో సొంత భవనాలు, ఉపాధ్యాయులు, వంట గదులు, టాయిలెట్లు లేకపోవడం, ఇరుకు గదులు తదితర సమస్యలు ఉన్నాయి. పాఠశాలల ప్రారంభంతో విద్యా సామగ్రి విక్రయించే దుకాణాలు విద్యార్థులు, తల్లిదండ్రులతో కిటకిటలాడుతున్నాయి. కొత్తసేటు పుస్తకాలతో పాటు మార్కెట్‌లో లభించే సరికొత్త డిజైన్‌ల బ్యాగులు, స్కూల్ డ్రెస్సులు, టిఫిన్ బాక్సులను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

4,836 మంది విద్యార్థుల గుర్తింపు

మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో 4,835 మంది బడి ఈడు, బడి బయటి పిల్లలను గుర్తించినట్లు డీఈవో ఎ.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గురువారం నుంచి నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానుందని, ఇప్పటికే అన్ని పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు సరఫరా చేశామని చెప్పారు. యూనిఫామ్స్ కూడా వచ్చినట్లు తెలిపారు. నారాయణపేట జిల్లాలో బడిబాట కొనసాగుతోంది.



మహబూబ్‌నగర్‌లోని ఏనుగొండ ప్రాథమిక పాఠశాల

పుట్టగొడుగుల్లా ప్రైవేట్ పాఠశాలలు

మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలలు పుట్ట గొడుగుల్లా పుట్టుకొచ్చాయి. 400లకుపైగా పాఠశాలు ఉన్నట్లు విద్యాశాఖ లెక్కలు చెబుతున్నాయి. రంగురంగుల కాగితాలను చేత పట్టుకొని, ఇంటింటికి తిరుగుతూ పాఠశాలల యాజమాన్యాలు ఇప్పటికే ప్రచారం చేశారు. నీట్, ఐఐటీ శిక్షణ ఇస్తున్నామని తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి విద్యార్థులను స్కూల్స్‌లో చేర్పించుకున్నారు. కార్పొరేట్ పాఠశాలల వద్ద ఇప్పటికే అడ్మిషన్స్ ఫుల్ అయ్యాయని బోర్డులు పెట్టడం గమనార్హం.

ఎస్సీ, ఎస్టీ కేసుల పరిష్కారంలో.. ప్రత్యేక చొరవ చూపాలి

- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



మాట్లాడుతున్న బక్కి వెంకటయ్య

నారాయణపేట టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీల కేసుల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని, వారిపై దాడుల నివారణకు ప్రతీ నెల చివరి వారంలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. బుధవారం నారాయణపేట కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆధ్వర్యంలో పోలీసు, రెవెన్యూ అధికారులు, ఎస్సీ ఎస్టీ అభివృద్ధి సంక్షేమ శాఖల అధికారులు, కుల సంఘాల నాయకులతో సమావేశం అయ్యారు. అట్రాసిటీ కేసులలో పురోగతి, భూ సమస్యలు, ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు సత్వర చర్యలు చేపట్టాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇంకా రెండు గ్లాసుల పద్ధతి, కుల వివక్ష ఉందని విచారం వ్యక్తం చేశారు. గతంలో ముడ్‌మాల్‌లో ఓ పూజారి దళితుల పట్ల వివక్షతో ఆలయ ప్రవేశం కల్పించకపోవడంపై అందిన ఫిర్యాదుతో తానే స్వయంగా వచ్చి, ఆలయ ప్రవేశం చేయించిన ఘటనను కమిషన్ చైర్మన్ గుర్తు చేశారు. జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీని వెంటనే ఏర్పాటు చేస్తామన్నారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారం, నష్టపరిహారం చెల్లింపులు, రెసిడెన్షియల్ పాఠశాలల వివరాలను తెలిపారు. షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి ఉమాపతి, డీఎస్పీ నల్లపు లింగయ్య, అదనపు కలెక్టర్ సించిత్ గంగ్వార్ మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బాధితుల నుంచి సమస్యలపై వినతి పత్రాలను స్వీకరించారు. సమావేశంలో కమిటీ సభ్యులు కొంకటి లక్ష్మీనారాయణ, నీలాదేవి, రాంబాబునాయక్, జడ్పీసీ ఈవో శైలేష్‌కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జయచంద్రమోహన్, డీఆర్డీఏ మొగులప్ప, డీటీడబ్ల్యూవో జనార్దన్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

- సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

పాలమూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి, నీళ్లు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కొద్దిపాటి నిధులతో పూర్తి చేయగలిగే పాలమూరు-రంగారెడ్డి, జూరాల, నెట్టెంపాడు, ఆర్‌డీఎస్ తదితర ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. కేసీఆర్ విచారణకు వెళ్లే సమయంలో ప్రజాస్వామ్య బద్ధంగ వెళ్లకుండా గుంపుస్వామ్యంతో వెళ్లడం సిగ్గుచేటన్నారు. కాళేశ్వరంపై విచారణ పూర్తిచేసి, భవిష్యత్తు సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. ఉద్యోగ నియామకంలో క్యాలెండర్ రూపొందించినట్లే ప్రాజెక్టుల నిర్మాణానికి క్యాలెండర్ రూపొందించాలన్నారు. 1925 నుంచి భారత సమాజంలో ప్రజలు సీపీఐ పార్టీని ఆదరిస్తున్నారని తెలిపారు. వందేళ్లుగా నేటికీ సీపీఐ ప్రజలకోసం పనిచేస్తోందని చెప్పారు. డబ్బే రాజకీయాలను శాసిస్తున్న నేటి సమాజంలో మనం జీవిస్తున్నామని వివరించారు. సీపీఐ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా పార్టీ జిల్లా, రాష్ట్ర, జాతీయ మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ జర్నలిస్టులకు యాజమాన్యాలు, ప్రభుత్వం ప్రాథమిక అవసరాలు తీర్చాలన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ చేపట్టి, అల్మాస్ ఫంక్షన్ హాలులో బహిరంగ సభ నిర్వహించారు. సభలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాలనరసింహా, జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్, పి.సురేష్, పరమేశ్వర్ గౌడ్, నరేందర్‌రెడ్డి, ఆనంది, గోవర్దన్ ప్రసంగించారు.



నారాయణపేటలో అలంకరణలో ఉన్న ఎద్దులు



నారాయణపేటలో ఎద్దులను ఊరేగిస్తున్న రైతులు

ఘనంగా ఏరువాక పౌర్ణమి

నారాయణపేట/ఊట్కూర్/మద్దూర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట, ఊట్కూర్, మద్దూర్ మండలాల్లో ఏరువాక పౌర్ణమిని బుధవారం రైతులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎద్దులను అలంకరించి, ఊరేగించారు. ఉదయం ఆలయాల్లో పూజలు చేశారు. అనంతరం ఎద్దులను రంగులు, అలంకరణ సామగ్రితో అలంకరించారు. సాయంత్రం గ్రామాల్లో కాడెద్దులను ఊరేగించారు. ఏరువాక తాడును తెంపించే కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు ప్రజలు అధిక సంఖ్యలో తరలొచ్చారు. మద్దూర్‌లో మార్కెట్ కమిటీ చైర్మన్ భీములు ఆధ్వర్యంలో రప్పించిన మహారాష్ట్ర కళాకారుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.





మద్దూరులో కళాకారుల విన్యాసాలు, ఊట్కూర్‌లో తిలకిస్తున్న ప్రజలు

ఎంపీఈవోలకు షోకాజ్ నోటీసులు

- డీఎస్ఆర్ యాప్‌పై కార్యదర్శుల అనాసక్తి 7
- డౌన్‌లోడ్ చేసుకోకపోవడంతో సర్కార్ సీరియస్
- 3 రోజుల్లో వివరణ ఇవ్వాలి : డీపీవో పార్థసారథి

అధికారి ఆలోచన.. అభాగ్యులకు ఆసరా!

- మహబూబ్‌నగర్ కలెక్టర్ వినూత్న ఆలోచన
- వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక ప్రజావాణి
- ప్రతీ నెల మొదటి బుధవారం ఫిర్యాదుల స్వీకరణ 6

యూనివర్సిటీల్లో వినూత్నమైన కోర్సులు

- ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి
- పీయూలో టీజీ పీఈసెట్ ఎంపికలు 7

అధికారి ఆలోచన.. అభాగ్యులకు ఆసరా..!

- మహబూబ్‌నగర్ కలెక్టర్ వినూత్న ఆలోచన
- వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక ప్రజావాణి
- అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహణ
- ప్రతీ నెల మొదటి బుధవారం ఫిర్యాదుల స్వీకరణ

మహబూబ్‌నగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు సేవ చేయాలన్న మంచి మనసు ఉండాలే కానీ కష్టమైన పని కూడా సులువవుతుంది. ఒకపూట తనకు కష్టమనిపించినా, ఆ సహాయం ఎంతో మందికి ఆసరా అవుతుందంటే అంతకు మించిన ఆనందం ఇంకేముంటుంది. అధికారి వద్దకు తాము వెళ్లడం కాదు.. తమ దగ్గరికే అధికారి వచ్చి సమస్యను పరిష్కరిస్తే ఆ అభాగ్యుల ఆనందం అంతా ఇంతా కాదు. మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేందిరబోయి ఇలాంటి కార్యక్రమానికే శ్రీకారం చుట్టారు. ప్రతీ సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసే ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్నారు. ప్రతీ వారం 100 నుంచి 150 మంది బాధితులు వివిధ సమస్యలపై ఫిర్యాదులు సమర్పిస్తున్నారు. వారితో పాటు వారి వెంట వచ్చే సహాయకులతో కలిసి ప్రతీ వారం దాదాపు 600 నుంచి 800 మంది వస్తుంటారు. ఫిర్యాదుదారుల్లో వృద్ధులు, దివ్యాంగులు కూడా ఉంటారు. అంత మందిలో వారు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటుంటారు. ఒక ఫిర్యాదు ఇచ్చేందుకు గంటల సమయం వేచి ఉండాల్సి వస్తోంది. ఫిర్యాదుదారుల సంఖ్య ఎక్కువగా ఉంటే తోపులాటలో వారు మరింత ఇబ్బంది పడుతూ ఉంటారు. నడవలేని స్థితిలో ఉన్న వారు ఎంతో కష్టపడి అధికారి వద్దకు చేరుకుంటుండటాన్ని స్వయంగా గమనించిన అధికారి చలించి పోయారు. కలెక్టర్ మనసు కరిగిపోయింది. వారి కోసం ఏదైనా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని భావించారు. కొందరు సీనియర్‌లను పిలిపించుకుని చర్చించారు. అప్పుడే ఆమెకు ఓ ఆలోచన వచ్చింది. ప్రతీ సోమవారం ప్రజావాణిలో సాధారణ వ్యక్తుల నుంచి ఫిర్యాదులు తీసుకోవడంతో పాటు, ప్రతీ నెల మొదటి బుధవారం వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక ప్రజావాణి నిర్వహించాలని నిర్ణయించారు. అలా బుధవారం నిర్వహించిన ప్రత్యేక ప్రజావాణికి 32 ఫిర్యాదులు వచ్చాయి.


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

ఆనందం వ్యక్తం చేస్తున్న బాధితులు

రాష్ట్రంలోనే ఈ వినూత్న కార్యక్రమాన్ని మహబూబ్‌నగర్ కలెక్టర్ అమలు చేస్తున్నారు. తాము ఎన్నో వ్యయ, ప్రయాసాలకు ఓర్చి అధికారి వద్దకు వెళ్లి గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చేదని వారు చెప్తున్నారు. ఇప్పుడు తమ వద్దకే అధికారి రావడం, తక్కువ మంది ఉండటం వల్ల తోపులాటలు లేకుండా వినతులు ఇచ్చేందుకు అనువైన వాతావరణం కల్పించడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. అధికారికి తమ సమస్యలను చెప్పుకునేందుకు ఎక్కువ సమయం ఇవ్వడంతో పాటు, ప్రత్యేక ప్రజావాణి కావడంతో సమస్య కూడా త్వరగా పరిష్కారం అవుతుందని బాధితులు చెప్తున్నారు.

ఫిర్యాదు ఇచ్చిన వెంటనే సంబంధిత అధికారి వివరాలను బుక్‌లో నమోదు చేసుకోవడం బాధితులకు ఊరటనిస్తోంది. అయితే కన్న కొడుకులు తమను పట్టించుకోవడం లేదని ఎక్కువ మంది వృద్ధులు ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తుండటం గమనార్హం.

అందరికీ అనువైన ప్రాంతంలో ఏర్పాటు

కలెక్టరేట్ సమీకృత భవనం పట్టణానికి దూరంగా ఉంది. వృద్ధులు, దివ్యాంగులు అంత దూరం రావడం కష్టం. అందుకే అందరికీ అందుబాటులో ఉండే ప్రాంతం కావాలని ఆలోచించారు. బస్టాండ్‌కు సమీపంలోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయం అయితే బాగుంటుందని, కోర్టు కూడా పక్కనే ఉంటుందని నిర్ణయించుకున్నారు. ఆ కార్యాలయంలోనే ప్రతీ నెల మొదటి బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. కలెక్టర్‌తోపాటు ఆయా శాఖల అధికారులు బాధితుల ఫిర్యాదులను స్వీకరించి, సమస్యలను తెలుసుకొని నోట్ చేసుకుంటున్నారు. ఇలా నెలలో ఓ రోజు అభాగ్యులకోసం కలెక్టర్ సమయం వెచ్చిస్తున్నారు.

ఫిర్యాదుల పరిష్కారంపై ఆరా

కలెక్టర్ విజయేందిరబోయి ప్రజావాణికి వచ్చిన వెంటనే గత నెలలో ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి? వాటిలో ఎన్ని పరిష్కారం అయ్యాయి? పరిష్కారం కాకపోతే అందుకు కారణాలు ఏంటి తదితర విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. దీర్ఘకాలికమైన సమస్యలను మినహాయి, మిగిలిన వాటిని అప్పటికప్పుడే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

చాలా మంచి కార్యక్రమం



కలెక్టర్ ఆలోచన అద్భుతం. వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక ప్రజావాణి ఏర్పాటు చాలా మంచి కార్యక్రమం. అందరికీ అనువైన ప్రాంతంలో ప్రజావాణి నిర్వహించడం, కలెక్టర్ సమయాన్ని వెచ్చించి బాధితుల వద్దకు వచ్చి వినతులు స్వీకరించడం గొప్ప విషయం. ఈ కార్యక్రమంతో సమస్య కూడా త్వరగా పరిష్కారం అవుతుంది.

- జగపతిరావు, సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు

అధికారిని తొందరగా కలిశాం



వృద్ధులు, దివ్యాంగుల కోసమే ప్రత్యేక ప్రజావాణి ఏర్పాటు చేయడంతో, వెంటనే అధికారిని కలిసే అవకాశం లభించింది. ఫిర్యాదుదారులు తక్కువ మంది ఉండటంతో అధికారులతో ఎక్కువ సమయం మాట్లాడే సమయం ఉంటోంది. సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటున్నారు. నేను బ్రెయిన్‌ట్రి ట్రై సైకిల్ కోసం వచ్చాను.

- శిరోమణి, భూత్పూర్

సన్నాలకూ సున్నం


మహబూబ్‌నగర్‌లోని ఓ రేషన్ దుకాణం వద్ద బారులు తీరిన లబ్ధిదారులు (ఫైల్)

(5వ పేజీ తరువాయి)

వేసిన వెంటనే బియ్యం ఇవ్వకుండా దానికి బదులు కిలోకు రూ. 8 నుంచి రూ. 10 వరకు లబ్ధిదారుడికి చెల్లించేవారు. ఆ బియ్యాన్ని రైస్‌మిల్లర్లకు పంపించడమో లేదా ఇండెంట్ తెచ్చుకోకుండా ఎంఎల్‌ఎస్ పాయింట్లు లేదా గోదాముల వద్దే సీఎంఆర్ కోటాను భర్తీ చేసుకోవడానికి సహాయపడేవారు. ఇప్పుడు కూడా అదే తరహా దందాకు రేషన్ డీలర్లు తెరలేపారు. సన్నబియ్యం మార్కెట్‌లో దాదాపు కిలోకు రూ. 40 పైమాటే. కానీ రేషన్ దుకాణాల వద్ద కిలోకు రూ. 16 పెట్టి కొనుగోలు చేస్తున్నారు. మూడు నెలల రేషన్ ఒకేసారి రావడంతో నలుగురు ఉన్న కుటుంబానికి 72 కిలోలు మూడు నెలల బియ్యానికి రూ. 1160 వరకు ఇస్తున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. కొన్నిచోట్ల కిలోకు రూ. 20 పెట్టి కొనుగోలు చేస్తున్నారు. అయితే గతంలో జరిగినంతగా కొనుగోళ్లు ప్రస్తుతం జరగడంలేదని చెప్పవచ్చు. ఎక్కువ మంది సన్నబియ్యం వాడుకోవడానికి ఇష్టపడుతుండటమే కారణం. అయితే మంచి సంకల్పంతో తీసుకువచ్చిన పథకాన్ని రేషన్ డీలర్లు దుర్వినియోగం చేస్తున్నారు. దుకాణాలపై నిఘా పెట్టడం, వచ్చిన ఇండెంట్, విక్రయించిన మొత్తం, ఎంత స్టాక్ ఉన్నదనే విషయాలపై అధికారులు దృష్టి పెడితే ఈ తరహా మోసాలను అరికట్టడానికి అవకాశం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

అనర్హులు ఎక్కువుండటమే కారణం...

ప్రస్తుతం ప్రజల్లో మెజారిటీ సన్నబియ్యం తినడానికే ఎక్కువగా ఇష్టపడుతున్నారు. అందుకే దొడ్డుబియ్యం పంపిణీ చేసినప్పుడు వాటిని విక్రయించి మరిన్ని డబ్బులు పెట్టి సన్నబియ్యం కొనుగోలు చేసేవారు. కానీ ఇప్పుడు ప్రభుత్వమే సన్నబియ్యం ఇస్తున్నప్పటికీ విక్రయిస్తుండటానికి కారణం రేషన్ లబ్ధిదారుల్లో ఎక్కువగా అనర్హులు ఉండటమేనని చెప్పవచ్చు. రేషన్ కార్డు అనేది అనేక పథకాలకు గుర్తింపుగా ఉన్నది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారే కాకుండా చాలామంది కేవలం బియ్యం కోసమే కాకుండా పథకాల లబ్ధి కోసం వాటిని పొందుతున్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్త రేషన్ కార్డులను జారీ చేస్తోంది. ప్రతినెలా కార్డులు పెరుగుతూనే ఉన్నాయి. కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నవారి వెరిఫికేషన్ చేస్తున్నవారు వారు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నారో లేదో చెక్ చేయకుండానే నామమాత్రపు వివరాలు సేకరించి కార్డులు మంజూరు చేస్తున్నారు. అలాగే గతంలో కార్డులు ఉన్నవారిలో ఎంతమంది దారిద్ర్య రేఖకు ఎగువన ఉన్నారో తెలుసుకొని తొలగింపు ప్రయత్నం చేయడం లేదు. అనర్హులు పెరిగిపోవడం వల్లే వారు రేషన్‌లో సన్నబియ్యం పంపిణీ చేస్తున్నా తినడానికి ఇష్టపడటం లేదు. రేషన్ దుకాణాల వద్దే విక్రయించి వెళుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త కార్డుల జారీతో పాటు అనర్హులను తొలగించే ప్రక్రియ కూడా చేపట్టాలని డిమాండ్ వస్తోంది.

సమన్వయంతో సత్ఫలితాలు సాధిస్తాం

(5వ పేజీ తరువాయి)

ఏళ్లుగా కష్టపడుతున్న నాయకులు, కార్యకర్తల సేవలను అధిష్ఠానం కచ్చితంగా గుర్తిస్తుంది. కొత్తగా వచ్చిన వారిని, పాత వారిని కలుపుకొని కలిసి కట్టుగా ముందుకు వెళ్తాం. సత్ఫలితాలు సాధిస్తాం.

సీఎం సొంత జిల్లా కావడంతో మీపై ఒత్తిడి పెరుగుతుంది కదా? ఎలా అధిగమిస్తారు?

సీఎం రేవంత్‌రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి సహకారంతో ముందుకు వెళ్తాం. ఒత్తిడి పెరిగినా యువతరం కావడంతో అనునిత్యం శ్రమిస్తూ, అటు పార్టీ కార్యకర్తలకు, ఇటు నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటాం. అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకెళ్తాం. నాతో పాటు మా మామయ్య, పార్టీ నారాయణపేట నియోజకవర్గ ఇన్‌చార్జి కుంభం శివకుమార్‌రెడ్డి, సోదరుడు పీసీసీ సభ్యుడు చిట్టెం అభిజయ్‌రెడ్డి అందుబాటులో ఉంటున్నారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయి కదా? ఎలా ముందుకు వెళ్తారు?

స్థానిక సంస్థాగత ఎన్నికల ముందు పార్టీ పదవి అప్పగించడంతో మరింత బాధ్యతను పెంచింది. సమష్టి కృషితో పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలతో కలిసి ముందుకు సాగుతాం. ప్రభుత్వ సంక్షేమ పథకాలు గడప గడపకు వివరిస్తాం. పార్టీ గెలుపే లక్ష్యంగా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తూ, ప్రణాళిక బద్ధంగా పని చేస్తాం. ఐక్యంగా శ్రమించి మెజారిటీ స్థానాలు హస్తగతం చేసుకుంటాం.

ఐదవ శక్తిపీఠం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

- దేవాదాయ శాఖ ప్రధాన కార్యదర్శి శైలజ రామయ్యర్
- అలంపూరు ఆలయాల అభివృద్ధిపై సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి చిన్నా రెడ్డి

అలంపూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఐదవ శక్తి పీఠమైన అలంపూరు ఆలయాలను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తోందని దేవాదాయ శాఖ ప్రధాన కార్యదర్శి శైలజ రామయ్యర్ అన్నారు. బుధవారం జోగుళాంబ ఆలయ అభివృద్ధి కోసం అలంపూర్ పట్టణంలోని ప్రసాద్ పథకంలో భాగంగా నిర్మించిన భవనంలో కలెక్టర్ బీఎం సంతోష్ ఆధ్యక్షతన సమీక్ష ఏర్పాటు చేశారు. ఈ సమీక్షకు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జీ చిన్నారెడ్డి, ఎమ్మెల్యే విజయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అలంపూరు ఆలయాలు ఆధ్యాత్మికంగా అత్యున్నత స్థానం కలిగి ఉన్నాయని, ఈ ఆలయాల అభివృద్ధి కోసం మాస్టర్ ప్లాన్‌ను ముఖ్యమంత్రికి సమర్పించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. చిన్నారెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రసిద్ధి చెందిన జోగుళాంబ ఆలయం అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ ఆలయం జాతీయ రహదారి పరిధిలో ఉండటంతో గద్వాల, జడ్చర్ల నుంచి ఆలయానికి వచ్చే మార్గంలో సూచికల బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం కలెక్టర్ బీఎం సంతోష్ మాట్లాడుతూ ఇప్పటికి వరకు పలుమార్లు సమీక్షా సమావేశం నిర్వహించామని, అన్ని శాఖల అధికారులతో కలిసి జోగుళాంబ దేవస్థానం, సంగమేశ్వర ఆలయాలను క్షేత్రస్థాయి సందర్శనలు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆలయ అభివృద్ధికి చేపట్టవలసిన వివరాలను ప్రదర్శించారు. అతకుముందు జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నరసింగరావు, ఆలయ కమిటీ చైర్మెన్ నాగేశ్వర్ రెడ్డి, అలంపూరు మార్కెట్ యార్డు చైర్మెన్ దొడ్డప్ప, తహసీల్దార్ మంజుల, ఆర్డీవో అలివేలు, ఆర్కిటెక్టు సూర్య నారాయణ మూర్తి, టెంపుల్ డిజైనర్లు గోవిందహరి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలకు ప్రోత్సాహం


చిన్నంబావి మండలంలో కొప్పునూర్‌లో సాగు చేసిన డ్రాగెన్ ఫ్రూట్స్ పంట

- 40 నుంచి 100 శాతం దాకా సబ్సిడీ
- జిల్లాకు రూ.48 కోట్లు మంజూరు

వీపనగండ్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పండ్ల తోటల సాగు విస్తీర్ణం పెంచేందుకు రాష్ట్రప్రభుత్వం సబ్సిడీలు ప్రకటించి రైతులను ప్రోత్సాహిస్తోంది. పండ్లు, కూరగాయలు, ఆయిల్ పామ్ వంటి పంటల సాగుకు అవసరమైన డ్రిప్, స్ప్రింక్లర్లు తదితర వాటిని సబ్సిడీపై అందించనున్నది. వనపర్తి జిల్లాలో ఉద్యాన పంటల సాగుకు 2025-26 సంవత్సరానికి గాను రూ.48 కోట్లతో వార్షిక ప్రణాళికను సిద్ధం చేశారు. ఉద్యాన పంటలు సాగు చేసే రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ప్రభుత్వం సబ్సిడీపై పరికరాలు అందిస్తోందని ఉద్యాన శాఖ జిల్లా అధికారి విజయ్‌కుమార్ తెలిపారు.

సూక్ష్మ సేద్యానికి 80 నుంచి 100 శాతం సబ్సిడీ..

బొప్పాయి, మామిడి, జామ, దానిమ్మ, బత్తాయి అవకాడో మొదలగు తోటల పెంపకానికి 40 నుంచి 50 శాతం రాయితీతో డ్రిప్ పరికరాలు అందించనున్నారు. కూరగాయల సాగుకు 40 శాతం, పూలతోటలు 40 శాతం, మల్చింగ్‌కు 50 శాతం సబ్సిడీతో డ్రిప్ పైపులు అందించనున్నారు. యంత్ర పరికరాలకు 40 నుంచి 50 శాతం సబ్సిడీతో 201 యూనిట్లు, ఫుడ్ కవర్ 50 శాతం సబ్సిడీ, వర్మీ కంపోస్టు షెడ్ల నిర్మాణానికి 50 శాతం సబ్సిడీతో 10 యూనిట్లు, ప్యాక్ హౌస్ 50శాతం సబ్సిడీతో ఎనిమిది యూనిట్లు మంజూరు చేశారు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం ద్వారా.. సూక్ష్మ సేద్యానికి 80 నుంచి 100 శాతం సబ్సిడీ అందించనున్నారు. శాశ్వత పందిరి నిర్మాణ/కూరగాయల సాగుకు 50 శాతం సబ్సిడీ తో 80 యూనిట్లు మంజూరు.

నేషనల్ మిషన్ ఆఫ్ ఎడబుల్ ఆయిల్..

ఈ పథకం ద్వారా జిల్లాలో 3,500 హెక్టార్లలో ఆయిల్ పామ్ తోటల సాగు విస్తీర్ణం పెంచేందుకు కృషి చేస్తున్నారు. ఇందుకోసం వనపర్తి మండలం కడుకుంట్లలో నర్సరీని ఏర్పాటు చేశారు. యాజమాన్యం అంతర్ పంటల ఖర్చు నిమిత్తం ఎకరాకు ప్రతీ సంవత్సరం రూ.4,200 చొప్పున రైతులకు తొలి 4 సంవత్సరాలలో చెల్లించనున్నారు.

ఉద్యాన రైతులకు రాయితీలు



పండ్లతోటలు సాగుచేసే రైతులను ప్రోత్సాహించేందుకు ప్రభుత్వం ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీ పథకాలు అమలుచేస్తోంది. 2025-26 సంవత్సరానికి గాను జిల్లాకు మంజూరైన బడ్జెట్ అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసి ఆసక్తి గల రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరిస్తున్నాం. డ్రిప్పు, స్ప్రింక్లర్ల కోసం రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

- కృష్ణయ్య, ఉద్యాన శాఖ మండల అధికారి

రాజ్యాంగం అమలులో విఫలం

- టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం
- అమరచింతలో యూనియన్ జిల్లా ప్రథమ మహాసభ



సదస్సులో మాట్లాడుతున్న టియుసిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం

అమరచింత, జూన్ 11(ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగం అమలులో కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం విమర్శించారు. వనపర్తి జిల్లా, అమరచింత పట్టణంలో బుధవారం జిల్లా ప్రథమ మహాసభ నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు అరుణ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సభలో సూర్యం మాట్లాడారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని 2016లో సుప్రీంకోర్టు ఆదేశించినా కేంద్ర ప్రభుత్వం నేటికీ అమలు చేయడం లేదని విమర్శించారు. ప్రచారం కోసం కార్మికుల పాదాలు కడిగే ప్రధాని మోదీ, వారి హక్కులను మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. వివిధ రంగాల్లో పని చేస్తున్న లక్షలాది మంది కార్మికులు ఐక్యమై ఉద్యమిస్తే పాలకులు దిగిరాక తప్పదన్నారు. కనీస వేతన చట్టాన్ని అమలు చేసి, కార్మికులకు రూ. 26 వేల జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సభ అనంతరం వివిధ మండలాల నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చిన కార్మికులతో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అరుణ్ కుమార్, ప్రసాద్, హనుమంత్, రాజు, రాజన్న, సామెల్, కురుమన్న, ప్రేమరత్నం, భక్తరాజు, జిలానీ, రామచంద్ర, గణేశ్, అరుణోదయ కళాకారులు సత్యనారాయణ, గౌస్, విజయ్, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

ఇథనాల్ కంపెనీ రద్దు చేయాలి

- పాలమూరు అధ్యయన వేదిక

పాలమూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, రాజోలి మండలంలోని పెద్దధన్వాడ వద్ద ఏర్పాటు చేయనున్న ఇథనాల్ కంపెనీని రద్దు చేయాలని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం. రాఘవాచారి బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇథనాల్ కంపెనీల ఏర్పాటు మానుకోవాలన్నారు. రైతుల జీవితాలతో చెలగాటమాడే విధంగా 10వ తేదీన రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మీడియాతో మాట్లాడటం సరికాదన్నారు. ఇథనాల్ కంపెనీలు పెట్టుడే, ఆందోళనకారులపై చర్యలు ఉంటాయని హెచ్చరించడం విడ్డూరంగా ఉందన్నారు. తాము అధికారంలోకి రాగానే సమీక్షిస్తామని ఎన్నికల ముందు మంత్రి చెప్పిన మాటలను గుర్తుచేశారు. అధికారం చేతికి వస్తే ప్రజలు కనిపించరా..? అని ప్రశ్నించారు. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో ఇథనాల్ కంపెనీని రద్దు చేసినట్లుగా, మహబూబ్‌నగర్ జిల్లాలో ఎందుకు రద్దు చేయరో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఒకటి చెప్పి మరొకటి చేసినందుకే ప్రజలు ఓడించారని చెప్పారు. జిల్లాలోని భూములను కంపెనీల పెట్టుబడిదారులకు, సాగునీటిని నల్లగొండకు, గుట్టలను మైనింగ్ కంపెనీలకు అప్పగించి ఇక్కడి ప్రజలు శాశ్వతంగా నిర్వాసితులయ్యే పరిస్థితి కల్పిస్తున్నారని విమర్శించారు. ఈ ఆశాంతి వల్లే ప్రజలు ఆందోళనలకు దిగుతున్నారని గుర్తుచేశారు. పెద్దధన్వాడ ఉద్యమం తెలంగాణ వ్యాపిత పోరాటంగా బలపడుతుందని పేర్కొన్నారు.

తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు పాఠశాలల పరిశీలన

జడ్చర్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేయనున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను జడ్చర్లలో ఏర్పాటు చేసేందుకు బుధవారం మునిసిపాలిటీలోని పాఠశాలలను అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, డీఈవో ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. బాదేపల్లి బాలుర జడ్పీహెచ్‌ఎస్, జడ్చర్ల జడ్పీహెచ్‌ఎస్‌ను ఎంఈవో మంజులాదేవి, ఎంపీడీవో విజయ్‌కుమార్, మునిసిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డితో కలిసి పరిశీలించారు. 1 నుంచి 10వ తరగతి వరకు ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన కొనసాగుతోందని, అందుకు పాఠశాలల వివరాలను ప్రభుత్వానికి నివేదిక పంపించనున్నట్లు అధికారులు తెలిపారు. బాదేపల్లి బాలుర జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం చంద్రకళ, ఉపాధ్యాయుడు ఇబ్రహీం పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యం

నాగర్‌కర్నూల్ క్రైం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థిని ఆస్కానీ అదృశ్యమైనట్లు ఎస్‌ఐ గోవర్ధన్ బుధవారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎర్రగడ్డకాలనీలో నివాసం ఉంటున్న ఆస్కాని వసంత హైదరాబాద్‌లో ఇంజినీరింగ్ చదువు తుంది. ఇటీవల ఇంటికి వచ్చిన ఆమె బుధవారం తెల్లవారుజామున ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. తండ్రి అశ్విని కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మద్యం మత్తులో యువకుడిపై దాడి

- అడ్డువచ్చిన, విధినిర్వహణలో ఉన్న పోలీసులపై కూడా దౌర్జన్యం
- 8 మందిపై కేసు నమోదు

గద్వాల క్రైం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో ఉన్న వ్యక్తులు ఓ వ్యక్తిపై దాడి చేయడమే కాకుండా విషయం తెలుసుకొని అక్కడికి వచ్చిన పోలీసు సిబ్బందిపై కూడా దౌర్జన్యానికి తెగబడిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లాలో మంగళవారం రాత్రి చోటుచేసుకున్నది.

జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం పాల్వాయి గ్రామానికి చెందిన భరత్‌కుమార్ అనే వ్యక్తి తన సొంత పనుల కోసం గద్వాలకు వచ్చి తిరిగి ఇంటికి బయలుదేరాడు. దారిలో గద్వాలలోని మార్కెట్ యార్డ్ సమీపంలోకి రాగానే బైక్‌లో పెట్రోలు అయిపోయి కార్పెంటర్ రాముడు అలియాస్ రామాచారి ఇంటిముందు ఆగిపోయింది. అప్పటికే జములమ్మ దేవర సందర్భంగా ఒకే కమ్యూనిటీకి చెందిన కొందరు వ్యక్తులు ఆ ఇంటిలో మద్యం తాగారు. బైక్‌ను తన ఇంటిముందు ఎందుకు ఆపావని రామాచారి ప్రశ్నిస్తూ పెట్రోల్ అయిపోయిందని భరత్ చెబుతున్నా వినకుండా దాడి చేశాడు. అతనితో పాటు అక్కడే ఉన్న ఆయన కుటుంబ సభ్యులు కూడా ఒక్కసారిగా కర్రలు, చేతులతో దాడిచేశారు. వారి దాడి నుంచి తప్పించుకొని వెళ్లి సమీపంలోనే ఉన్న పట్టణ పోలీస్ స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. వెంటనే ఇద్దరు పోలీస్ సిబ్బంది భరత్‌పై దాడిచేసిన ఇంటిదగ్గరకు చేరుకోగానే వారు పోలీసులు అని చూడకుండానే మద్యం మత్తులో ఉన్న కుటుంబ సభ్యులు వారిపై కూడా దాడి చేసినట్లు తెలిసింది. ఈ విషయాన్ని పోలీస్ సిబ్బంది ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఎస్‌ఐతో పాటు మరికొంతమంది పోలీసులు అక్కడికి చేరుకోగానే మళ్లీ పోలీస్ సిబ్బందిపై వారు దౌర్జన్యానికి పాల్పడ్డారు. దీంతో నిందితులను పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించారు.

8 మందిపై కేసు నమోదు

భరత్ అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు బుధవారం ఎనిమిది మందిపై కేసులు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై దౌర్జన్యం చేస్తే ఎవరినీ ఊపేక్షించేదిలేదని హెచ్చరించారు. పార్టీల నెపంతో రోడ్డుపై వెళ్లే వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు. రామాచారి, మహేష్ ఆచారి, మనీష్‌కుమార్, శివ, శ్రీకాంతాచారి, శశికళ, అలివేలమ్మ, సుజాతలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆరేళ్ల బాలికపై అత్యాచార యత్నం

పాన్‌గల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ఆరేళ్ల బాలికపై అత్యాచార యత్నం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసిన సంఘటన వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలంలో బుధవారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వనపర్తిలోని పీర్లగుట్టకు చెందిన తిరుపతయ్య (62) పాన్‌గల్ మండలంలోని ఓ గ్రామంలో కోళ్ల షెడ్డు నిర్మాణ పనులు చేయడానికి వచ్చాడు. మద్యం మత్తులో ఉన్న తిరుపతయ్య షెడ్డు పక్కనే ఇంటి ముందు చెట్టుకు ఊయల ఊగుతున్న ఆరేళ్ల బాలికను కోళ్ల షెడ్డు నిర్మాణ పనుల దగ్గరకు తీసుకెళ్లి అత్యాచార యత్నం చేశాడు. దీంతో ఆ బాలిక కేకలు వేయడంతో పక్కనే ఉన్న తమ కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకొని అతనికి దేహశుద్ధి చేశారు. 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వడంతో అక్కడికి పోలీసులు చేరుకొని సంఘటనపై వివరాలు సేకరించారు. విషయం తెలిసిన డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐ కృష్ణ, పాన్‌గల్ ఎస్‌ఐ శ్రీనివాస్ యాదవ్ గ్రామానికి చేరుకొని పూర్తి వివరాలు సేకరించి వృద్ధుడిని అదుపులోకి తీసుకున్నారు. బాలికను వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అతనిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పది పరీక్షల్లో ఫెయిల్..

- మనస్తాపంతో ఇంటి నుంచి వెళ్లిపోయిన విద్యార్థి

భూత్పూర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : పది పరీక్షల్లో ఫెయిల్ అయిన ఓ విద్యార్థి మనస్తాపంతో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ చంద్రశేఖర్ కథనం ప్రకారం.. వెల్కిచర్ల గ్రామానికి చెందిన గోసుల నారాయణ, నర్సమ్మకు ఇద్దరు సంతానం వారిలో గోసుల కుర్మయ్య పదో తరగతిలో ఫెయిల్ అయ్యాడు. తీవ్ర మనస్తాపంతో కొన్ని రోజులు ఇంట్లోనే ఉన్నాడు. ఈనెల 8న ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవంతో తల్లి గోసుల నర్సమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్రైం కార్నర్

రోటవేటర్ కింద పడి బాలుడి మృతి


కావలి సాయికుమార్ (ఫైల్)

కోడేరు, జూన్11 (ఆంధ్రజ్యోతి) : ట్రాక్టర్ రోటవేటర్ కింద పడి ఓ బాలుడు మృతి చెందాడు. నాగర్‌కర్నూల్ జిల్లా, కోడేరు మండల పరిధిలోని జనుంపల్లి గ్రామంలో ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ గోకారి తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన కావలి నాగేంద్ర, కావలి ఉషమ్మ దంపతులకు ఒక కుమారుడు కావలి సాయికుమార్ (13), ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. నాగేంద్ర బుధవారం తన పొలంలో ట్రాక్టర్ రోటవేటర్‌తో దుక్కి దున్నుతుండగా వెనుకనే వస్తున్న సాయికుమార్ ప్రమాదవశాత్తు దాని కింద పడి మృతి చెందాడు. సాయికుమార్ ప్రస్తుతం వనపర్తిలో 8వ తరగతి పూర్తి చేసుకుని 9వ తరగతిలో అడుగు పెట్టాల్సి ఉంది. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు గుండెలు పగిలేలా రోదించారు. తండ్రి నాగేంద్ర ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ సత్యనారాయణపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

వంగూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, వంగూరు మండలంలోని ఉల్పర గ్రామంలో బుధవారం ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ముద్దమల్ల బాలస్వామి (42) మద్యానికి బానిసయ్యాడు. దీంతో అనారోగ్యానికి గురైన ఆయన తరుచూ భార్య పద్మమ్మతో గొడవ పడుతుండే వాడు. ఇదే క్రమంలో మంగళవారం రాత్రి కూడా భార్యతో గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన ఆయన బుధవారం ఉదయం గ్రామ సమీపంలో ఓ రైతు పొలంలోని చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడికి ముగ్గురు కుమారులు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ పుట్ట మహేశ్ తెలిపారు.

పెళ్లి ఇంట్లో నగలు, నగదు చోరీ

ఖిల్లాఘణపురం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : పెళ్లి ఇంట్లో నగలు, నగదు చోరీకి గురయ్యాయి. వనపర్తి జిల్లా, ఖిల్లాఘణపురం మండలంలోని షాపూర్ గ్రామంలో ఈ సంఘటన జరిగింది. బాధితులు, ఎస్‌ఐ సురేశ్‌గౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన తులసమ్మ కుమారుడి వివాహం ఈనెల 8న జరిగింది. ఆ తర్వాత రాత్రి ఆమె తన కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి ముందున్న అరుగు మీద నిద్రపోయింది. మరుసటి రోజు తెల్లవారుజామున 5:30 గంటల సమయంలో నిద్ర లేచిన ఆమె చూసుకోగా మెడలోని మూడున్నర తులాలు, రెండు వరుసల బంగారు పుస్తెలతాడు, పర్సులో ఉన్న రూ.4 వేలు నగదు చోరీ అయ్యాయి. కుటుంబ సభ్యులు, ఇరుగుపొరుగు వారిని విచారించినా ఫలితం లేకపోయింది. దీంతో బుధవారం ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పరిశ్రమలో అగ్నిప్రమాదం

- రూ. 4 లక్షల ఆస్తి నష్టం


జడ్చర్ల మండలం పోలేపల్లి టీఎస్‌ఐఐసీలోని పరిశ్రమలో మంటలను ఆర్పుతున్న జడ్చర్ల ఫైర్‌స్టేషన్ సిబ్బంది

జడ్చర్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలంలోని పోలేపల్లి టీఎస్ ఐఐసీ ప్రాంగణంలోని డెక్కన్ బోర్డు పరిశ్రమలో బుధవారం అగ్నిప్రమాదం జరిగింది. పరిశ్రమలోని బ్రాయిలర్ పైపులైనులో ఆయిల్ నిలిచిపోవడంతో మంటలు చెలరేగాయి. గమనించిన పరిశ్రమ ప్రతినిధులు వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. దీంతో జడ్చర్ల ఫైర్‌స్టేషన్ లీడింగ్ ఫైర్‌మెన్ రాఘవేందర్, డ్రైవర్ ఆపరేటర్ రాంచంద్రయ్య, ఫైర్‌మన్ మోహన్, ప్రేమ్‌కుమార్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. సంఘటన స్థలాన్ని జిల్లా ఫైర్ ఆఫీసర్ కిశోర్, స్టేషన్ ఆఫీసర్ రాజేందర్‌లు పరిశీలించారు. సుమారు రూ.4 లక్షల విలువైన పని ముట్లకు నష్టం వాటిల్లిందని తెలిపారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

ఇటిక్యాల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ఆత్మహత్యాయత్నం చేసిన ఓ యువతి చికిత్స పొందుతూ మృతి చెందింది. జోగుళాంబ గద్వాల జిల్లా, ఇటిక్యాల మండ లంలోని షాబాద గ్రామంలో ఈ సంఘటన జరిగింది. ఇటిక్యాల ఎఎస్‌ఐ ఆర్ సుధాకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మహేశ్వరి (25) భర్తలో విడాకులు తీసుకొని తల్లి పద్మమ్మ వద్దే ఉంటోంది. గ్రూప్ పరీక్షలు రాస్తానని, హైదరాబాద్‌కు వెళ్లి శిక్షణ తీసుకుంటానని ఈ నెల 2వ తేదీన ఆమె తల్లిని అడిగింది. అందుకోసం డబ్బు కావాలని కోరింది. అందుకు రెండు రోజులు ఆగాలని తెలపడంతో మహేశ్వరి తల్లితో గొడవ పడి ఇంట్లోకి వెళ్లి పురుగుల మందు తాగి పడిపోయింది. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. సంఘటనపై తల్లి పద్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎఎస్‌ఐ తెలిపారు.

యూనివర్సిటీల్లో వినూత్నమైన కోర్సులు

- ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి
- పీయూలో ప్రారంభమైన టీజీ పీఈసెట్ ఎంపికలు
- తొలి రోజు 368 మంది విద్యార్థులు హాజరు


టీజీ పీఈ సెట్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి, పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్, అధికారులు

పాలమూరు యూనివర్సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : మారుతున్న కాలానికి అనుగుణంగా రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో వినూత్నమైన కోర్సులను అందుబాటులోకి తీసుకొస్తామని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పాలమూరు యూనివర్సిటీలో మొట్టమొదటి సారి నిర్వహిస్తున్న టీజీ పీఈసెట్‌ను బుధవారం వైస్ చాన్సలర్, ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, పూర్వ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్, రిజిస్ట్రార్ రమేశ్‌బాబు, అధికారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ వచ్చే విద్యాసంవత్సరం నుంచి విద్యా విధానంలో నూతన మార్పులు తీసుకొస్తామన్నారు. విద్యార్థులకు నాణ్యమైన, అవగాహనతో కూడిన నైపుణ్యం, ఉపాధి అవకాశాలు లభించే మరిన్ని కోర్సులను ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. పాలమూరు యూనివర్సిటీలో, పచ్చని ప్రకృతి నడుమ తెలంగాణ రాష్ట్ర ఫిజికల్ ఎడ్యుకేషన్ ఎంట్రన్స్ టెస్టు (టీజీ పీఈ సెట్) నిర్వహించడం శుభపరిణామం అన్నారు. అనంతరం ఆయనను పీయూ వైస్ చాన్సలర్, ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, పూర్వ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్, రిజిస్ట్రార్ రమేశ్ బాబు తదితరులు గజమాలతో ఘనంగా సన్మానించారు. ఆ తర్వాత పీఈసెట్‌లో పాల్గొనేందుకు వచ్చిన విద్యార్థులను పరిచయం పరిచేసుకొని, జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

● బీపీఎడ్ కోర్సులో 515 మంది విద్యార్థులకు గాను 368 మంది విద్యార్థులు హాజరయ్యారని, 147 మంది గైర్హాజరయ్యారని టీజీ పీఈసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ దిలీప్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీపీఎడ్ కోర్సులో 217 మంది విద్యార్థులకు గాను 149 మంది హాజరయ్యారు. 68 మంది గైర్హాజర య్యారని పేర్కొన్నారు.

సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకోవాలి


విద్యార్థులను పరిచయం చేసుకుంటున్న రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి

కాలానుగుణంగా సాంకేతిక నైపుణ్యాలను పెంపొం దించుకోవాలని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి అన్నారు. పాలమూరు యూనివర్సిటీ లోని ఫార్మసీ ఆడిటోరియంలో కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభమైన రెండు రోజుల వర్క్‌షాప్‌నకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్ తరాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యావిధానంలో మార్పులు దేవాలన్నారు. ప్రతీ ఒక్కరు జాతీయ విద్యావిధానం ప్రకారం బహుళ సబ్జెక్టులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ మాట్లాడుతూ సిలబస్ కరికులంలో ఉన్నత విద్యామండలి సూచన మేరకు సమూల మార్పులు తీసుకొస్తామన్నా రు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేశ్‌బా బు, అకాడమిక్ సెల్‌డైరెక్టర్ డాక్టర్ చంద్రకిరణ్, ప్రిన్సిపాల్ డాక్టర్ కరుణాకర్ రెడ్డి, డాక్టర్ మధుసూ దన్ రెడ్డి, డాక్టర్ రవికాంత్, విభాగాధిపతి విభాగాధిపతి డాక్టర్ ఆంజనేయులు, అధ్యపకులు పాల్గొన్నారు.

శ్రీశైలం, జూరాల ప్రాజెక్టులకు వరద

ధరూరు/ దోమలపెంట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని జూరాల, శ్రీశైలం ప్రాజెక్టులకు వరద నీరు కొనసాగుతోంది. బుధవారం కూడా ఇన్‌ఫ్లో నమోదయ్యింది.

జోగుళాంబ గద్వాల జిల్లాలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద నిలకడగా కొనసాగుతున్న అధికారులు తెలిపారు. ఎగువన ఉన్న ఆల్మట్టి జలాశయంలో 62.16 టీఎంసీలకు, నారాయణపూర్ జలాశయంలో 29.84 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. బుధవారం జూరాల జలాశయంలో 317.950 మీటర్లలో 9.805 టీఎంసీల నీటి నిల్వ ఉండగా 10 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. నెట్టెంపాడు లిఫ్ట్ కెనాల్‌కు 1500 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్ లిఫ్ట్ కెనాల్‌కు 315 క్యూసెక్కులు కలిపి జూరాల ప్రాజెక్టు నుంచి 1883 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఎగువన ఉన్న సుంకేసుల జలాశయం నుంచి 6,710 క్యూసెక్కులు విడుదల అవుతుండని శ్రీశైలం ప్రాజెక్టుకు 9,601 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదౌతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడగులకు గాను, 836.00 అడుగుల్లో 215.807 టీఎంసీల సామర్థ్యానికి గాను 56.2910 టీఎంసీల నీటి నిల్వలు నమోదు అవుతున్నట్లు డ్యాం గేజింగ్ అధికారులు తెలిపారు. గడిచిన 24 గంటల వ్యవధిలో కుడి గట్టు విద్యుత్ కేంద్రంలో 857 క్యూసెక్కుల నీటిని వినియోగించి 0.416 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో 3,098 క్యూసెక్కుల నీటిని ఉపయోగించి 1.450 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి కొనసాగించగా, శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 4,271 క్యూసెక్కుల నీటిని విద్యుత్ ఉత్పాదనతో సాగర్‌కు విడుదల చేస్తున్నట్టు డ్యాం అధికారులు తెలిపారు.

కేంద్రంలో అవినీతి రహిత పాలన

- బీజేపీ మాజీ ఎమ్మెల్సీ రామచంద్రారావు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ రామచంద్రారావు

గద్వాల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడి 11 ఏళ్ల అయ్యిందని, ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో అవినీతి రహిత పాలన కొనసాగుతోందని మాజీ ఎమ్మెల్సీ రామచంద్రారావు అన్నారు. జిల్లా కేంద్రంలోని డీకే బంగ్లాలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2004 నుంచి 2014 వరకు కొనసాగిన యూపీఏ పాలనలో అన్నీ స్కామ్‌లే జరిగాయని, పెద్ద ఎత్తున అవినీతి జరిగి నల్లడబ్బును పోగేసుకున్నారని విమర్శించారు. కానీ 2014 నుంచి 11 ఏళ్లుగా సాగుతున్న బీజేపీ ప్రభుత్వంలో ఒక్క స్కామ్‌ను కానీ, అవినీతిని కానీ చూపిస్తారా? అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ఆయుష్మాన్ భారత్, జన ఔషధి, కిసాన్ సమ్మాన్ నిధి తదితర పథకాలు ప్రజల ఆశయాలను, ఆశలను నెరవేర్చుతున్నాయని వివరించారు. 140 కోట్ల మంది భారతీయుల ఆశీర్వాదాలు, సమష్టి భాగస్వామ్యంతో దేశం విభిన్న రంగాల్లో వేగవంతమైన మార్పులను చూసిందన్నారు. దేశాన్ని ప్రపంచంలో నాలుగవ ఆర్థిక శక్తిగా నిలిపేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారని వివరించారు.

సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, జిల్లా ఇన్‌చార్జి డీకే స్నిగ్ధారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ ఎగ్బోటే, జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బండల వెంకట్రాములు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ, జిల్లా ఓబీసీ అధ్యక్షులు దేవదాస్, నాయకులు బల్గెర్ శివారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ అకాడమీకి నేటి నుంచి విద్యార్థుల ఎంపిక


రాష్ట్రస్థాయి వాలీబాల్ అకాడమీకి విద్యార్థుల ఎంపిక కోసం ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీవైఎస్‌వో శ్రీనివాస్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వాలీబాల్ అకాడమీకి విద్యార్థుల ఎంపిక గురువారం నుంచి ప్రారంభం కానున్నది. రెండు రోజుల పాటు ఈ ప్రక్రియ కొనసాగనున్నది. కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను బుధవారం డీవైఎస్‌వో శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ప్రధాన స్టేడియంలో ఉదయం 8 గంటలకు ఎంపికలు ప్రారంభమవుతాయని తెలిపారు. 2009, జూన్ 30 నుంచి 2011, జూలై 1 మధ్య జన్మించిన బాల, బాలికలు అర్హులని చెప్పారు. బాలుర ఎత్తు 182 సెంటీమీటర్లు, బాలికల ఎత్తు 166 సెంటీమీటర్లకు పైగా ఉండాలని తెలిపారు. దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించి, ప్రతిభ కనబరిచిన వారిని అకాడమీకి ఎంపిక చేస్తామని వెల్లడించారు. రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడా పోటీల్లో సర్టిఫికెట్లు సాధించిన వారి మొదటి ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఒరిజినల్ జనన ధ్రువపత్రం, పాఠశాల, కళాశాల బోనఫైడ్, ఆధార్, రెసిడెన్షియల్ సర్టిఫికెట్లతో నేరుగా హాజరుకావాలని సూచించారు. తప్పుడు, నకిలీ ధ్రువపత్రాలు తీసుకొస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో కోచ్‌లు సునీల్, పర్వేజ్ పాల్గొన్నారు.

26న క్రీడా పాఠశాలకు

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రధాన స్టేడియంలో ఈ నెల 26న జిల్లా క్రీడా పాఠశాలకు విద్యార్థులను ఎంపిక చేయనున్నట్లు డీవైఎస్‌వో శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడా పాఠశాలలో 4వ తరగతి ప్రవేశాలకు జిల్లా స్థాయిలో ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. 8 నుంచి 9 సంవత్సరాల వయస్సు ఉండి, 2016, సెప్టెంబర్ 1 నుంచి 2017, ఆగస్టు 31 మధ్య జన్మించిన వారు అర్హులని తెలిపారు. విద్యార్థులు జనన ధ్రువీకరణ, ఆధార్, 3వ తరగతి బోనఫైడ్, ఉత్తీర్ణత ధ్రువపత్రాలు, రెండు పాస్ ఫొటోలతో హాజరు కావాలన్నారు. ఉదయం 8:00 గంటలకు రావాలని సూచించారు.

కాటేజీల నిర్మాణానికి సర్వే షురూ

- అమరగిరి ద్వీపం అభివృద్ధికి చర్యలు
- పరిశీలించిన ఉన్నతాధికారులు


అమరగిరి కృష్ణానది ఐల్యాండ్ వద్ద సర్వే నిర్వహిస్తున్న రాష్ట్ర పర్యాటక శాఖ అధికారులు

కొల్లాపూర్, జూన్ 11(ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ మండల పరిధిలోని పర్యాటక ప్రాంతం అమరగిరి సమీపంలో కృష్ణానదిలోని ద్వీపం (ఐల్యాండ్)లో కాటేజీల నిర్మాణానికి బుధవారం సర్వే ప్రారంభమైంది. కాటేజీ నిర్మాణాల కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో నిర్మాణ పనులను ప్రారంభించేందుకు పర్యాటక ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశానుసారం ఉన్నధికారులు బుధవారం ద్వీపాన్ని పరిశీలించారు. పర్యాటక శాఖ జిల్లా అధికారి కల్వరాల నరసింహ, పర్యాటక శాఖ కార్పొరేషన్ డీఈ పరశువేది, ఏఈఈ నాగార్జునగౌడ్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జానయ్య, సర్వేయర్లతో కలిసి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా కల్వరాల నరసింహ మాట్లాడుతూ కృష్ణానది ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవల్) ఉన్న సమయంలోనూ 5 ఎకరాల ప్రభుత్వ భూమి ఐల్యాండ్‌గా పర్యాటకులను ఆకర్షిస్తుందని తెలిపారు. ఇక్కడ పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు మంత్రి జూపల్లి కృష్ణారావు దృఢ నిశ్చయంతో ఉన్నారని చెప్పారు. సర్వే పూర్తి చేసి మంత్రితో పాటు, కలెక్టర్‌కు త్వరలోనే నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ కృష్ణ, అమరగిరి గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు మిద్దె రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువ

- అమరచింతలో వేంకటేశ్వర స్వామి కల్యాణం
- అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- అలరించిన అన్నమయ్య కీర్తనలు


స్వామి, అమ్మవార్ల కల్యాణం జరిపిస్తున్న అర్చకుడు

అమరచింత, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, అమరచింత పట్టణంలో బుధవారం నిర్వహించిన అలివేలు మంగ సమేత లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం కనుల పండువగా కొనసాగింది. బీసీ కాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. బ్రహ్మశ్రీ కొల్లూరి భీమాచార్య ఆశ్రమ వేద పండితుల ఆధ్వర్యంలో కల్యాణం జరిపించారు. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ నిర్వాహకులు డాక్టర్ ఉత్తరపల్లి రామాచార్యులు వాక్యోపదేశం ఇచ్చారు. ఈ సందర్భంగా జల్లాపురం రామకృష్ణారెడ్డి బృందం ఆలపించిన అన్నమాచార్య కీర్తనలు భక్తులను అలరించాయి. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు.

ఎంపీఈవోలకు షోకాజ్ నోటీసులు

- 'డీఎస్ఆర్'పై పంచాయతీ కార్యదర్శుల అనాసక్తి
- డౌన్‌లోడ్ చేసుకోకపోవడంతో సర్కార్ సీరియస్
- ఉద్యోగాల నుంచి తొలగిస్తామని ఓపీఎస్‌లకు హెచ్చరికలు
- మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలి : డీపీవో పార్థసారథి


సమస్యలను పరిష్కరించాలని డీపీవోకు వినతి పత్రం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు (ఫైల్)

మహబూబ్‌నగర్ న్యూటౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో పారిశుధ్య పనుల పర్యవేక్షణకు రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ డైలీ శానిటేషన్ రిపోర్టు (డీఎస్ఆర్)యాప్‌ను రూపొందించింది. పంచాయతీ కార్యదర్శులు ఈ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకోవాలని ఆదేశించింది. ప్రతీ రోజు అందులో ఫేస్ రికగ్నైజ్‌తో పాటు చెత్త సేకరణ వివరాలను నమోదు చేయాలని సూచించింది. యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునేందుకు గత నెల 24న చివరి తేదీగా నిర్ణయించింది. ఆ బాధ్యతను మండల పంచాయతీ అధికారులు (ఎంపీఈవో)లకు అప్పగించింది. కానీ మహబూబ్‌నగర్ జిల్లాలోని 16 మండలాల పరిధిలో ఇప్పటివరకు ఒక్క పంచాయతీ కార్యదర్శి కూడా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోలేదు. దీంతో బుధవారం రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఎంపీఈవోలకు డీపీవో షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మూడు రోజుల్లోగా జవాబు ఇవ్వాలని ఆదేశించారు. యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులు సన్నద్ధం అవుతున్నారు. ఉద్యోగాల నుంచి తొలగిస్తామని ఔట్ సోర్సింగ్ (ఓపీఎస్) కార్యదర్శులకు హెచ్చరికలు జారీ చేశారు. ఇప్పటికే తమకు ఉద్యోగ భద్రత లేదని అధికారులకు మొర పెట్టుకుంటున్న కార్యదర్శులు ప్రభుత్వ నిర్ణయంతో భయాందోళనలకు గురవుతున్నారు.

మొదటి నుంచి వ్యతిరేకిస్తున్న కార్యదర్శులు

డైలీ శానిటేషన్ రిపోర్టు (డీఎస్ఆర్) యాప్‌ను పంచాయతీ కార్యదర్శులు మొదటి నుంచి వ్యతిరేకిస్తున్నారు. యాప్‌లోని కొన్ని నిబంధనలు మార్చాలని కోరుతున్నారు. ఈ విషయంపై రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కను కలిసి విన్నవించుకున్నారు. సోమవారం అన్ని మండలాల ఎంపీడీవోలకు వినతి పత్రాలు సమర్పించారు. మంగళవారం కలెక్టర్ విజయేందిర బోయిని కలిసి సమస్యలను విన్నవించారు. కానీ ప్రభుత్వం వారి వినతులను పరిగణనలోకి తీసుకోలేదు. ఎంపీవోలకు షోకాజ్ నోటీసులు ఇవ్వడంతో, వారు వెంటనే పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు.

మొబైల్ ఫోన్లు, ట్యాబ్‌లు ఇవ్వకపోతే ఎలా?

అవసరమైన పరికరాలు (మొబైల్ ఫోన్లు, ట్యాబ్‌లు) ఇవ్వకపోతే యాప్‌ను ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఉపాధిహామీ పథకంలో పని చేసే ఫీల్డ్ అసిస్టెంట్లకు మొబైల్ ఫోన్లు ఇచ్చారు. కానీ గ్రామ పంచాయతీల్లో కనీసం ఒక్క ట్యాబ్ కూడా అందుబాటులో లేదు. పంచాయతీ కార్యదర్శులే వారి సొంత మొబైల్‌లో శానిటేషన్ వివరాలను అప్‌లోడ్ చేస్తు న్నారు.

అన్ని సౌకర్యాలు సమకూర్చి, గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయాలని వారు కోరుతున్నారు. ఇతర శాఖల పనులను తమకు అప్పగించకపోతే డీఎస్ఆర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని, వివరాలను నమోదు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్తున్నారు.

జవాబు ఇవ్వక పోతే చర్యలు



పంచాయతీ రాజ్ శాఖ ఆదేశం మేరకు ఎంపీఈవోలకు షోకాజ్ నోటీసులు జారీ చేశాం. నోటీసులకు సరైన జవాబు రాకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. ప్రతీ గ్రామ కార్యదర్శి ప్రభుత్వం డీఎస్ఆర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాల్సిందే. ప్రతీ రోజు ఫేస్ రికగ్నైజ్‌తో పాటు చెత్త సేకరణ వివరాలను అప్‌లోడ్ చేయాల్సిందే. అందులో ఎవరికీ ఎలాంటి మినహాయింపులు ఉండవు. ఔట్ సోర్సింగ్ కార్యదర్శులు వెంటనే డౌన్‌లోడ్ చేసుకోకపోతే విధుల నుంచి తొలగిస్తాం.

\- పార్థసారథి, డీపీవో

న్యూస్ బాక్స్

ఘనంగా కబీర్‌దాస్ జయంతి

జడ్చర్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రముఖ హిందీకవి కబీర్‌దాస్ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుకన్య, అధ్యాపకులు డాక్టర్ నరసింహారావు, డాక్టర్ నర్మద, రాఘవేందర్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ నర్సిములు, డాక్టర్ వెంకటయ్య, డాక్టర్ పుష్పలత, నందకిశోర్ పాల్గొన్నారు.

ముగిసిన కరాటే శిబిరం

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : హనుమాన్ కరాటే, యోగా అసోసియేషన్ ఫౌండర్ వెంకటేశ్ ఆధ్వర్యంలో మోడల్ బేసిక్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన వేసవి యోగా, కరాటే శిబిరం బుధవారం ముగిసింది. ఈ శిబిరానికి టీపీసీసీ జనరల్ సెక్రటరీ సంజీవ్‌ముదిరాజ్ హాజరై విద్యార్థులకు బెల్టులు ప్రదానం చేశారు.

ప్లాస్టిక్ కవర్లు వాడొద్దు

జడ్చర్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ కవర్లకు బదులుగా బట్ట సంచులను వినియోగించాలంటూ జడ్చర్ల మునిసిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డి సూచించారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా బుధవారం పలు వార్డుల్లో ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలు వివరించారు.

ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య

జడ్చర్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య అందుతోందని మండలంలోని కోడ్గల్ జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం శ్రీనివాసులు పేర్కొన్నారు. కోడ్గల్, ఈర్లపల్లి, ఈర్లపల్లితండాలలో బుధవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి, ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు.

ఏజెన్సీ విధానం రద్దు చేయాలి

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం) జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసి, కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రభుత్వ ఆసుపత్రిలోని శానిటేషన్ కార్మికులు బుధవారం కొత్తగూడెం సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, ఇదే విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలన్నారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

మహబూబ్‌నగర్ న్యూటౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సూర్యలక్ష్మీ కాటన్ మిల్ వేంకటేశ్వర స్వామి 33వ బ్రహ్మోత్సవాలు ఈనెల 20 నుంచి 29 వరకు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు శ్రీకాంత్‌శర్మ తెలిపారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. వేంకటేశ్వర స్వామి సేవా మండలి ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర శర్మ, సభ్యులు రాజేశ్వర్, సుదర్శన్‌గౌడ్, నందకిషోర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

రైతులు వినియోగించుకోవాలి

దేవరకద్ర, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ మోహన్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని మీన్గోనిపల్లి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. మిన్గోనిపల్లి, గురకొండ గ్రామాల్లో 26 దరఖాస్తులు వచ్చినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయండి



వినతిపత్రం ఇస్తున్న ఎంపీ డీకే అరుణ

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోగల నారాయణపేట జిల్లా కేంద్రంలో సైనిక్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలని మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్‌ను బుధవారం కలిసి వినతి పత్రం అందించారు. గత బీఆర్‌ఎస్ అసమర్థత వల్ల సైనిక్ స్కూల్ ఏర్పాటు ప్రక్రియ ఆగిపోయిందని చెప్పారు. సాధ్యమైనంత త్వరగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆటో, బైకును ఢీకొట్టిన డీసీఎం

మూసాపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ఆటో, బైకును డీసీఎం ఢీ కొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మూసాపేట స్టేజీ రోడ్డు క్రాసింగ్ వద్ద బుధవారం చోటు చేసుకుంది. తాటికొండ గ్రామానికి చెందిన బాలరాజు ఆటోలో నిజాలాపూర్ నుంచి మహబూబ్‌నగర్ వైపు వెళ్లడానికి మూసాపేట హైవే స్టేజీ దగ్గర రోడ్డు క్రాస్ చేస్తున్నా అదే విధంగా ద్విచక్రవాహనంపై వెళ్తున్న తిరుపతయ్య కూడా అదే వైపు వెళ్తున్నాడు. వెనక నుంచి డీసీఎం ఢీ కొట్టడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.

మంత్రి వాకిటి శ్రీహరికి సన్మానం

మహబూబ్‌నగర్ న్యూటౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : మంత్రి వాకిటి శ్రీహరిని బుధవారం సాయంత్రం మక్తల్‌లోని ఆయన స్వగృహంలో మహబూబ్‌నగర్ మాజీ మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్, నాయకులు శాంతన్న యాదవ్, మాజీ కౌన్సిలర్ శివశంకర్, నాయకులు రాషేద్ శాలువాతో ఘనంగా సత్కరించారు.

కురుమూర్తి ఆలయ అభివృద్ధికి కృషి

» ఏడాదిలోపు ఘాట్‌రోడ్డు పనులు పూర్తి

» ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డి



ఘాట్‌రోడ్డు పనులు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

చిన్నచింతకుంట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : కురుమూర్తి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని, ఇందుకోసం ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డికి గతంలోనే వివరించినట్లు దేవరకద్ర ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని అమ్మాపూర్ గ్రామ సమీపంలోని కురుమూర్తి వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో రూ.110 కోట్ల వ్యయంతో నిర్మించే ఘాట్‌రోడ్డు పనులను ఎమ్మెల్యే ప్రారంభించి, మాట్లాడారు. కురుమూర్తి స్వామి ఆశీస్సులతో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేరుస్తోందన్నారు. అడిగిందే తడువుగా ఘాట్‌రోడ్డు పనులకు సీఎం రూ.110 కోట్లు మంజూరు చేయడం సంతోషకరం అన్నారు. ఏడాదిలోపు ఘాట్‌రోడ్డు పనులు పూర్తిచేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రానున్నకాలంలో కురుమూర్తి ఆలయ ప్రాంగణంలోనూ, జాతర మైదానంలో కాటేజీలు, కల్యాణ మండపం వంటి అభివృద్ధి పనులు చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే స్వర్ణసుధాకర్‌రెడ్డి, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్‌కుమార్‌రెడ్డి, కురుమూర్తి ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, దేవరకద్ర మార్కెట్ కమిటీ చైర్మన్ కథలప్ప, టీపీసీసీ నాయకులు సాంబయ్య, భాస్కర్‌యాదవ్, పాలకవర్గం సభ్యుడు భాస్కరాచారీ, ఆర్‌అండ్‌బీ డీఈ సంధ్య, ఏఈఈ రాజేష్, శ్రీరామ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, నాయకులు సురేందర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, శివకుమార్, రంజిత్‌రెడ్డి, వెంకటేష్, జీజీ పౌలు, శేఖర్, ప్రతాప్, వెంకటేష్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

దేవరకద్ర : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం కౌకుంట్ల మండల కేంద్రంలోని వివిధ గ్రామాల్లో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్‌లు పంపిణీ చేసి, భూమి పూజ నిర్వహించారు. అనంతరం ఎండోమెంట్ నిధులు రూ.40 లక్షలతో శివాలయ పునఃనిర్మాణానికి భూమిపూజ చేశారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి



చిన్నచింతకుంటలో ఏరువాక తాడును తెంచుతున్న రైతులు

కోయిలకొండ/రాజాపూర్/దేవరకద్ర/చిన్నచింతకుంట/గండీడ్/హన్వాడ/జడ్చర్ల/భూత్పూర్ జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా ఏరువాక పౌర్ణమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎద్దులను అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏరువాక పౌర్ణమి రోజు పూజలు నిర్వహించి పొలం పనులు మొదలు పెడితే పంటలు బాగా పండుతాయని రైతుల నమ్మకం. కోయిలకొండ మండల కేంద్రంలోని ఆదిహనుమాన్ ఆలయం నుంచి గౌని వరకు ఎద్దుల బండ్ల ఊరేగింపు నిర్వహించి, ఏరువాక తాడును తెంపారు. రాజాపూర్ మండల కేంద్రంలోని హనుమన్ ఆలయంలో గ్రామస్థులు అఖండ భజన చేశారు. రాయపల్లిలో రైతులు చెరువు తూము వద్ద ప్రత్యేక పూజలు చేశారు. దేవరకద్ర, కౌకుంట్ల మండల కేంద్రాల్లోని ఆలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఎద్దుల బండ్లలతో ఊరేగింపు నిర్వహించారు. ఏరువాక తాడును తెంచారు. మొదటి తాడు తెంచిన రైతుకు బహుమతి అందజేశారు. చిన్నచింతకుంట మండల కేంద్రంలో మొదటి సారి బస్టాండు కూడలిలో ఏరువాక తాడును తెంచారు. గండీడ్ మండల కేంద్రంతో పాటు వెన్నాచేడ్, పెద్దవార్వల్, రుసుంపల్లి, సల్కర్‌పేట్ గ్రామాలతో పాటు హన్వాడ మండల కేంద్రంలో ఏరువాక తాడును తెంచారు. జడ్చర్ల పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆయంలో అర్చకుడు సుధీంద్రాచార్య ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భూత్పూర్ మండలం పోతులమడుగులో రైతులు కాడెద్దులతో తోరణాలు తెంచే కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన 12 మంది రైతులు కాడెద్దులను తీసుకొచ్చి పోటీల్లో పాల్గొన్నారు. ఎల్లుటి కృష్ణయ్య, చాకలి సత్తయ్య కాడెద్దులు తోరణం తాడును తెంచాయి.

డివిజన్ల ఏర్పాటులో లోపించిన పారదర్శకత



మాట్లాడుతున్న తెలంగాణ బీసీ మహాసభ నాయకులు

పాలమూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ మునిసిపాలిటీలో డివిజన్ల ఏర్పాటులో పారదర్శకత లోపించిందని బీసీ మహాసభ జాతీయ అధ్యక్షుడు మెట్టుకాడి శ్రీనివాస్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా అధ్యక్షుడు వి.కె.రాంచంద్రయ్య, సారంగి లక్ష్మీకాంత్, హరిప్రకాష్, మెట్టుకాడి ప్రభాకర్‌తో కలిసి మాట్లాడారు. మునిసిపల్ కార్పొరేషన్‌లో మొత్తం 1,99,6,602 ఓటర్లు ఉన్నట్లు అధికారులు ప్రకటించినట్లు గుర్తు చేశారు. దాని ప్రకారం 60 డివిజన్లకు సుమారు 3200 ఓటర్లు ఉండాలి. ఎక్కువకు ఎక్కువ 3500 ఓటర్లు - తక్కువకు తక్కువ 2900 ఓటర్లు ఉండాలనే నిబంధన ఉందన్నారు. ఎక్కువ, తక్కువ కాని ఏకంగా 14వ వార్డులో 4,949 ఓట్లు అంటే 2 వేలు ఓట్లు ఎక్కువ వచ్చినట్లు ఆరోపణలు వచ్చాయని తెలిపారు. అఖిలపక్ష నాయకులు, ప్రజాసంఘాలతో సమీక్ష ఏర్పాటు చేసి లోపాలను సరిచేయాలన్నారు. సమావేశంలో నీలి విష్ణు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వార్డుల విభజన సౌకర్యంగా విభజించాలి

పాలమూరు : మహబూబ్‌నగర్ మునిసిపాలిటీలోని వార్డులు ప్రజలు, ప్రజాప్రతినిధులకు సౌకర్యంగా విభజించాలని బండ్లగేరి కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు. బుధవారం మునిసిపల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. 2020లో బండ్లగేరి 28వ వార్డుగా ఉంటే నేడు 2025లో 40వ వార్డుగా ఉందన్నారు. కిసాన్‌నగర్, బండ్లగేరి, కుమ్మరివాడి, కుర్హిహినిశెట్టికాలనీ వీధులను కలుపుతూ ఓల్డ్ రేల్వేగేటు, మెయిన్‌రోడ్డు గుండా వార్డును విభజిస్తే కొత్తగా ఎన్నికయ్యే ప్రజాప్రతినిధులకు, ప్రజలకు సౌకర్యంగా ఉండి అభివృద్ధికి బాగుంటుందన్నారు.

అధికార పార్టీకి అనుకూలం

మహబూబ్‌నగర్ : పాలమూరు కార్పొరేషన్ పరిధిలో డివిజన్ల విభజన పారదర్శకంగా జరగలేదని, అధికార పార్టీకి మాత్రమే అనుకూలంగా చేశారని బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం కమిషనర్ మహేశ్వర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. రోడ్ మ్యాప్ లేకుండా ఇంటి నెంబర్‌తో చేయడం సరికాదన్నారు. డివిజన్‌ల విభజన మళ్లీ చేయాలని, లేదంటే న్యాయపరంగా ముందుకెళ్తామన్నారు. మాజీ కౌన్సిలర్లు గణేష్, అనంతరెడ్డి, రాము, నాయకులు నవకాంత్, సతీష్, శ్రీనివాస్‌రెడ్డి, శరత్‌రెడ్డి పాల్గొన్నారు.

అభ్యంతరాలకు ముగిసిన గడువు

- 94 అభ్యంతరాల స్వీకరణ

- నేటి నుంచి పరిశీలన

మహబూబ్‌నగర్ : పాలమూరు కార్పొరేషన్ డివిజన్ల విభజనపై ఇచ్చిన అభ్యంతరాల గడువు బుధవారంతో ముగిసింది. అయితే విభజన శాస్త్రీయంగా జరగలేదని 60 డివిజన్లకు గానూ 94 అభ్యంతరాలు వచ్చాయి. వీటన్నింటిని పరిష్కరించేందుకు ఐదు రోజుల గడువు ఉంది. నేటి నుంచి ఈనెల 16వరకు వచ్చిన అభ్యంతరాలను అధికారులు పరిశీలించాలి. అవసరమైతే క్షేత్ర పరిశీలన చేసి చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. పలు వార్డుల్లో మార్పులు, చేర్పులు జరిగే అవకాశం ఉంది. కొన్ని కాలనీలను రెండుగా విభజించి రెండు డివిజన్‌లలో కలిపారని, అలా కాకుండా ఒకే కాలనీని ఒకే డివిజన్‌లో కలుపాలనే వినతులు ఎక్కువగా వచ్చాయి. అధికారులు ఏమేర పారదర్శకత పాటిస్తారో చూడాలి.

వంట మనుషులు పరిశుభ్రత పాటించాలి

భూత్పూర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వడ్డించే ఏజెన్సీ వారు తప్పనిసరిగా వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని ఎంఈవో ఉషారాణి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన ఏజెన్సీల వారితో పాటు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ చేతులు శుభ్రంగా ఉంచుకోవాలని, గోళ్లను కత్తిరించుకోవాలని, శుభ్రంగా ఉండే వంట పాత్రలను వాడుకోవాలని సూచించారు.

ఇంజనీరింగ్ విద్యార్థులకు మంచి భవిష్యత్తు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ఇంజనీరింగ్ చదివిన విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉందని తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టరెడ్డి అన్నారు. బుధవారం జయప్రకాష్ నారాయణ ఇంజనీరింగ్ కళశాలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతి ప్రదానం, చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కళశాల చైర్మన్ కేఎస్ రవికుమార్ మాట్లాడుతూ ఎంబీఏ విద్యార్థి స్వాతి జెఎన్‌టీయూహెచ్ నుంచి గోల్డ్‌మోడల్ సాధించడం గర్వంగా ఉందన్నారు.

రోడ్డు వేయాలని గ్రామస్థుల ఆందోళన



ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

హన్వాడ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : కంకర వేశారు.. బీటీ రోడ్డు వేయడం లేదంటూ బుధవారం అయోధ్యనగర్ గ్రామస్థులు నిరసన తెలియజేశారు. నాలుగు సంవత్సరాల క్రితం పనులు ప్రారంభించి మధ్యలో వదిలేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వెంటనే రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు. కంకర వేయడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అధికారులు, నాయకులు ఇబ్బందిని గుర్తించి పరిష్కరించాలని కోరారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

మిడ్జిల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని, ప్రతీ ఒక్కరు యోగాను అలవర్చుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు శివకాంత్ అన్నారు. బుధవారం మండలంలోని కొత్తపల్లిలో ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించారు. డీటీ రవికాంత్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేస్తాం

» టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు సంజీవ్‌ముదిరాజ్, మిథున్‌రెడ్డి



టీపీసీసీ ప్రధాన కార్యదర్శులను సత్కరిస్తున్న ముడా చైర్మన్

మహబూబ్‌నగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : తమపై ఎంతో నమ్మకంతో టీపీసీసీ జనరల్ సెక్రటరీలుగా బాధ్యతలు అప్పగించారని, ప్రభుత్వ పథకాలు, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు సంజీవ్‌ముదిరాజ్, ఏపీ మిథున్‌రెడ్డి అన్నారు. తమకు బాధ్యత అప్పగించిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే, అధినేత్రి సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధానకార్యదర్శి కేసీ వేణుగోపాల్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శులుగా ఎంపికైన వారిని పార్టీ శ్రేణులు సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సమన్యాయం పాటిస్తూ అన్ని వర్గాలకు కాంగ్రెస్ ప్రాధాన్యం ఇస్తుందన్నారు. బీసీలపై కాంగ్రెస్‌కు మాత్రమే ప్రేమ ఉందని, బీసీలను పట్టించుకునే ఏకైక నాయకుడు రాహుల్‌గాంధీనేనని చెప్పారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో బీజేపీ ద్వందనీతి ప్రదర్శిస్తుందని విమర్శించారు. వర్గీకరణ కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇదివరకే అసెంబ్లీ తీర్మాణం చేసి కేంద్రానికి పంపించడం జరిగిందని, కేంద్రం జాప్యం చేయకుండా వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. డీసీసీ అధ్యక్షుడి రేసులో తానూ ఉన్నానని, తనకు అవకాశం ఇస్తే పీసీసీ పదవికి రాజీనామా చేస్తానని సంజీవ్ ముదిరాజ్ స్పష్టం చేశారు. ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రి, నాయకులు సీజె బెనహర్, సాయిబాబ పాల్గొన్నారు.

రాజీ చేసుకుంటే ఇద్దరూ గెలుస్తారు : ఎస్పీ

మహబూబ్‌నగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : కక్షలు, కొట్లాడితే ఒక్కరే గెలుస్తారని, అదే రాజీ మార్గంలో ముందుకెళ్తే ఇద్దరూ గెలుస్తారని ఎస్పీ జానకి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకుని రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవాలని కోరారు. చిన్నచిన్న కేసులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృథా చేసుకోవద్దన్నారు. లోక్‌అదాలత్‌లో క్రిమినల్ కేసులు, కాంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా, ఆస్తి విభజన, కుటుంబపరమైన నిర్వహణ, దొంగతనాలు, ఆస్తి విభజన, డ్రంకెన్ డ్రైవ్, న్యూసెన్స్, చెక్‌బౌన్స్, బ్యాంక్ రికవరీ, టెలిఫోన్ బిల్లులు, విద్యుత్ చౌర్యం వంటి కేసులను పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

మోదీ పాలనలో దేశం అభివృద్ధి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.వీ.ఎస్ ప్రభాకర్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని మోదీ పాలనలో కనీవిని ఎరగని రీతిలో దేశం అభివృద్ధి చెందిందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.వీ.ఎస్. ప్రభాకర్ అన్నారు. ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించిందని పేర్కొన్నారు. మోదీ 11ఏళ్ల పాలనపై బుధవారం జిల్లా అధక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరోనా సమయంలో ప్రపంచ దేశాలు అతలాకుతలమైనదే భారతదేశం మాత్రం సుస్థిరమైన ఆర్థిక వ్యవస్థను నిలదొక్కుకుందన్నారు. అంతేకాకుండా ప్రపంచ దేశాలకు 280 కోట్ల డోస్‌ల వ్యాక్సిన్ పంపిణీ చేసిందన్నారు. మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ద్వారా దేశంలో 20 కోట్ల కుటుంబాలు అభివృద్ధి దిశలో పయనిస్తున్నాయన్నారు. 80 కోట్ల ప్రజలకు ఉచితంగా బియ్యం అందిస్తుందన్నారు. ఆర్టికల్ 370 అధికారాన్ని తొలగించడం కోసమన్నారు. సుప్రీం కోర్టు మార్గదర్శకాల మేరకు ట్రిబుల్ తలాఖ్‌ను సవరించినట్లు తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఉమారాణి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి, జయశ్రీ, బాల్‌రాజ్, కన్వీనర్ పాండురంగారెడ్డి, కిషోర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్‌రెడ్డి, బీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు యాదయ్య, కృష్ణవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

పరిశ్రమ స్థాపనను ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పరిశ్రమల ఏర్పాటు చేసే విధంగా ప్రోత్సహించాలని అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖలతో ఏర్పాటు చేసిన జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిశ్రమల శాఖ, మునిసిపల్, బీసీ, ఎస్సీ కార్పొరేషన్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ భాగస్వామ్యంతో పరిశ్రమల ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టి, నిబంధనల మేరకు అనుమతులు మంజూరు చేయాలన్నారు. ఎలక్ట్రికల్ శాఖకు సంబంధించి పెండింగ్ ఉన్న 3 దరఖాస్తులను క్లియర్ చేయాలన్నారు. టి ప్రైడ్ ద్వారా షెడ్యూల్డ్ కులాల వారికి ట్రాక్టర్ అండ్ ట్రైలర్ వాహనాలు ఇద్దరికి, షెడ్యూల్డ్ తెగల వారికి ఒక ట్రాక్టర్, ఒక ట్రాలీ, ఒక మారుతి డిజైర్ వాహనాలకు గాను సబ్సిడీ మంజూరుకు కమిటీలో ఆమోదం తెలిపారు. గ్రీన్ ఇండస్ట్రియల్ సెజ్, పోలెపల్లి సెజ్‌లో స్ట్రీట్ లైట్లు పాతవాటి స్థానంలో కొత్తవి, రోడ్డు ప్యాచ్ వర్క్ రిపేర్లను జులై లోగా పూర్తి చేయాలని టీజీఐఐసీ అధికారులను ఆదేశించారు. జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ ప్రతాప్‌రెడ్డి, ఎల్.డీ.ఎం భాస్కర్, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ నాగరాజు, డిప్యూటీ డైరెక్టర్ గణేష్, డీపీవో పార్థసారథి, మోటార్ వేహికిల్ ఇన్స్‌పెక్టర్ రఘు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే సీపీఎం ఎజెండా



సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు జయలక్ష్మి

పాలమూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : కార్మిక, ప్రజల సమస్య పరిష్కారమే సీపీఎం ఎజెండా అని రాష్ట్ర కమిటీ సభ్యురాలు జయలక్ష్మి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహిస్తున్న సీపీఎం జిల్లా స్థాయి క్యాడర్ క్లాసులలో మూడో రోజు ఆమె మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను మభ్యపెట్టే విధానాలు చేస్తున్నాయని, ఒక వైపు నిరుద్యోగం, ఆకలి, దరిద్రం పెరుగుతోందన్నారు. మరోవైపు కేంద్రం మోదీ నాయకత్వంలో 11 ఏళ్ల పాలనలో స్వర్ణయుగమని చెప్పడాన్ని తీవ్రంగా ఖండించారు. కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా జూలై 9న దేశవ్యాప్త సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తిచేసి సాగునీరు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు డిమాండ్ చేశారు. నల్లవెల్లి కురుమూర్తి, కిల్లె గోపాల్, పద్మ, లక్ష్మయ్య, రాంరెడ్డి, దీప్లానాయక్, మోహన్, ప్రశాంత్, భరత్, అనురాధ, చంద్రమ్మ, చంద్రకాంత్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

గెస్టు లెక్చరర్లకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్) కళాశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి గాను గెస్టు లెక్చరర్ల పోస్టులకు ఈనెల 19 లోపు దరఖాస్తు చేసుకోవాలని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ మొరజుల్లాఖాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9 పోస్టులు ఖాళీగా ఉండగా, సైకాలజీ 1, సోషియాలోజి 1, గణితం 2, ఇంగ్లిష్ 2, తెలుగు 1, హెల్త్ ఫిజికల్ ఎడ్యుకేషన్ 1, ఫైన్ ఆర్ట్స్ 1 ఖాళీ ఉన్నట్లు తెలిపారు. అర్హత గల 65 ఏళ్ల లోపు వయస్సు గల వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కాంగ్రెస్‌తోనే సొంతింటి కల సాకారం



మంజూరు పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

కోయిలకొండ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : పదేళ్లలో సాకారం కాని సొంతింటి కల కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నెరవేరబోతోందని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని వీరభద్ర స్వామి కల్యాణ మంటపంలో 650 ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు, అందించి మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల తరువాత రేషన్‌కార్డులు అందించడం అందిచనున్నట్లు తెలిపారు. ఎండీఓ కాళప్ప, సూపరింటెండెంట్ హరీశ్వర్‌రెడ్డి, ఎంపీవో నసీర్ అహ్మద్, నాయకులు రవీందర్, విద్యాసాగర్ గౌడ్, సత్యపాల్‌రెడ్డి, రవినాయక్, విక్రమ్‌గౌడ్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

రూ.10 లక్షలు వెచ్చించి గుంతలు పూడ్చేస్తారట

» సుందరీకరణకు మరో రూ.15 లక్షలు వెచ్చించేందుకు ప్రతిపాదనలు

» నేడు జడ్చర్ల మునిసిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

జడ్చర్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ ఆదాయానికి గండి కొడుతున్న అనుమతులు లేని నిర్మాణాలపై ఉదాసీనత వ్యవహరిస్తున్న జడ్చర్ల మునిసిపాలిటీ పాలకవర్గం సభ్యులు, అందుకు భిన్నంగా రూ.10 లక్షలు వెచ్చించి మట్టితో గుంతలు పూడ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వీటితో పాటు మునిసిపాలిటీ సుందరీకరణకు ఫ్లైఓవర్ బ్రిడ్జి, పెద్దపెద్ద గోడలకు, అండర్ పాస్ బ్రిడ్జిలకు పెయింటింగ్‌కు మరో రూ.15 లక్షలు వెచ్చించేందుకు గురువారం నిర్వహించే మునిసిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశంలో ప్రతిపాదనలు పెట్టేందుకు సిద్ధం చేశారు. వీటితో పాటు ముడా నుంచి విడుదలైన నిధులు అభివృద్ధి పనుల పేరుతో ప్రతీ వార్డుకు రూ.3 లక్షల చొప్పున కౌన్సిలర్లు ఇప్పటికే పంచుకునేందుకు నిర్ణయించారు. మునిసిపాలిటీలో అవసరమైన ప్రాంతాల్లో నిధులు వెచ్చించాల్సి ఉండగా అందుకు భిన్నంగా తయారు చేసిన ఎజెండాపై పాలకవర్గం సభ్యులు ఏ విధంగా స్పందిస్తారో అంటూ పట్టణ ప్రజలు ఎదురుచూస్తున్నారు. అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టిన భవనాలతో లక్షల రూపాయల ఆదాయం కోల్పోయిన అంశంపై చర్యలు తీసుకోకపోవడం, కొందరి కౌన్సిలర్‌లు, అధికారులపై వచ్చిన రూమర్‌లను ఖండించకపోవడం గమనార్హం. ఇదిలా ఉండగా జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రహరీ ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో డబ్బాలు ఏర్పాటు చేసుకునేందుకు కొందరు పోటీ పడుతుండగా, వారికి కొలతలు వేసి, ఖాళీ స్థలం కేటాయించేందుకు అధికార పార్టీ నాయకులతో పాటు కౌన్సిలర్లు ఉత్సాహం చూపిస్తున్నారు. ఈ అంశాలపై మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో ఏం చర్యలు తీసుకుంటారో అని ప్రజలు చర్చించుకుంటున్నారు.